# ఆరో ప్రాణం

A Telugu short story by అబ్రకదబ్ర

http://anilroyal.wordpress.com
All rights reserved © 2009-2010

Genre: Crime/Suspense
Date: 23 July 2009

---

ముఖమ్మీద పడుతున్న చినుకుల్ని చేత్తో తుడుచుకుంటూ వడివడిగా అడుగులేస్తున్నాను. రాత్రి పదకొండున్నర కావస్తుంది చుట్టూ చిమ్మచీకటి. రోడ్డు మీద నేను తప్ప నరసంచారం లేదు. దూరంగా మిణుకుమంటున్న వీధి దీపం. దానికింద పడుకున్న ఊరకుక్కే కాబోలు - ఆగీ ఆగీ ఏడుస్తుంది. కీచురాళ్ల సొద, ఊరకుక్క రోదన, నా అడుగుల చప్పుడు, నేనూ ఉన్నానంటూ అడపాదడపా ఈదురుగాలి చేసే హృదయవిదారక శబ్దం. మిగతాదంతా నిశ్శబ్దం.

అరగంట నుండీ నడుస్తున్నానలా. పడుతుంది తుప్పరే ఐనా పూర్తిగా తడిసిపోయాను. వర్షం ఎక్కువవటంతో నడక వేగం పెంచుతూ ప్యాంటు జేబునోసారి తడుముకున్నాను. భద్రంగానే ఉందది. మరో పదడుగులేశాక - చలి వణికిస్తుంటే చేతులు రుద్దుకుంటూ - మళ్లీ అటు చూశాను.

వీధి దీపం కింద ఆగంతకుడు. *ఇందాక చూసినప్పుడు లేడే!*

పొద్దున పేపర్లో చదివిన వార్త గుర్తొచ్చింది – 'పలాసపురం పరిసరాల్లో సీరియల్ కిల్లర్ సంచారం'. జిల్లా ఎడిషన్లో తాటికాయంత శీర్షిక పెట్టి మరీ ప్రచురించటంతో వార్తాంశం మొత్తం గుర్తుండిపోయింది.

'పలాసపురం ఏజెన్సీ ప్రాంతంలో వరుసగా జరుగుతున్న హత్యలకు పరిసర ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత రెండు నెలల్లో ఐదుగురు వ్యక్తులు అంతుపట్టని రీతిలో మృతి చెందటం, హత్యలన్నీ రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా ఉండే ప్రదేశాల్లో జరగటంతో చీకటి పడ్డాక ఇళ్లలోనుండి బయటికి రావటానికి ఆ ప్రాంత ప్రజలు భీతిల్లుతున్నారు. ఈ హత్యలన్నిట్లోనూ ముద్దాయి ఒకడేనని పోలీసులు అనుమానిస్తూ, అదే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. అయితే, హత్యలన్నీ వేర్వేరు ఆయుధాలతో జరిగినట్లు ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చిన నివేదిక పోలీసుల వాదనకి బలం చేకూర్చేదిగా లేదు. ఇది ఓ హంతక ముఠా పనేననీ, ఒక్కడి పని కాదనీ స్థానికులు భావిస్తున్నారు. జిల్లా ఎస్పీ మాత్రం ఇది సీరియల్ కిల్లర్ పనేనని స్పష్టం చేశారు. పోలీసులని తప్పుదోవ పట్టించటానికే అతను విభిన్న పద్ధతుల్లో హత్యలకు పాల్పడుతున్నాడని ఆయన విలేకర్ల సమావేశంలో చెప్పారు. ఈ తరహా కేసులు పరిష్కరించటంలో అనుభవమున్న పోలీసు అధికారినొకరిని ఈ కేసు కోసం ప్రత్యేకంగా నియమించామనీ, హంతకుడు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమనీ, త్వరలోనే అతన్ని కలుగులోంచి ఎలుకలా బయటికి లాగి న్యాయస్థానం ముందు నిలబెడతామనీ ఉద్ఘాటించారు. హంతకుడు పట్టుబడేవరకూ ప్రజలని అప్రమత్తంగా ఉండమని, అపరిచితులతో జాగ్రత్తగా వ్యవహరించమని, రాత్రివేళల్లో ఒంటరిగా బయట సంచరించవద్దనీ ఆయన విజ్ఞప్తి చేశారు'

*కొంపదీసి వాడు కాదు కదా?*, అనుమానం మొదలయింది. *ఎక్కడ నుండొచ్చాడు? ఈ సమయంలో ఇక్కడేం చేస్తున్నాడు?* అనుమానం క్షణంలోనే పెనుభూతమైంది. ముందుకి వెళదామా లేక అక్కడే ఆగిపోదామా అనే

డోలాయమానంలో పడి నడక వేగం తగ్గించాను. అంతలో అతను నన్ను చూసేసినట్లున్నాడు. `హలో’ అని పెద్దగా అరుస్తూ నాకేసి చెయ్యూపాడు.

ఆగిపోదామనుకున్నవాడిని, ఇక తప్పేలా లేకపోవటంతో ముందుకే సాగాను. అతని పలకరింపు వినిపించనట్లు నటిస్తూ తలొంచుకుని నడవసాగాను – కంటి చివరలనుండి అతన్నే గమనిస్తూ.

‘పలాసపురానికేనా?’, మరో అరుపు. ఈదురు గాలుల మధ్యలో తేలొచ్చింది. దీనికీ బదులివ్వలేదు. ఇవ్వాలో వద్దో ఆలోచించుకునేలోపే వీధిదీపం దగ్గరికొచ్చేశాను.

కుక్క ఏడుపులు అరుపులుగా ఎప్పుడు మారాయో - ఒకటే అరుస్తుంది. *దెయ్యాల్ని చూస్తే కుక్కలు ఏడుస్తాయంటారు. హంతకుల్ని చూస్తే మొరుగుతాయా?* అంత చలిలోనూ నా అరచేతిలో చెమటలు పట్టాయి. గుండె వేగంగా కొట్టుకోసాగింది. అనుమానంగా అతన్నే కొనగంట చూస్తూ నడక వేగం పెంచి అతన్ని దాటేయబోయాను. పైనుండి నిలువుగా పడుతున్న దీపం వెలుగులో అతని ముఖకవళికలు కనపడలేదు. మనిషి బలిష్టంగా ఉన్నట్లున్నాడు. బూడిద రంగు జాకెట్ వేసుకుని కళ్లజోడు పెట్టుకున్నాడు. చేతిలో లెదర్ పౌచ్ లాంటిదేదో ఉంది. అతన్ని దాటుతూ లిప్తపాటులో నేను గమనించిన వివరాలివి. *ఇంత చీకట్లో నల్ల కళ్లజోడు! లెదర్ పౌచ్‌లో ఏముంది – తుపాకినా?* గుండె దడ ఎక్కువైంది. కుక్క అరుస్తూనే ఉంది

‘ఛత్ నీయ్..’

పెద్దగా తిడుతూ కుక్కని డొక్కలో తన్నాడతను. ఎగిరి రెండడుగుల దూరంలో పడిందది. ఎక్కడ దెబ్బ తగిలిందో - మూలుగుతూ లేచి కుంటుకుంటూ పారిపోయింది. *మూగప్రాణిపై అంత కౄరత్వం ప్రదర్శించేవాడు ఎవడై ఉంటాడు?* నా అనుమానం బలపడుతుంది.

*వీడొక్కడేనా, చెట్ల చాటునో, చీకట్లోనో నక్కి ఇంకొందరూ ఉన్నారా?*, కొత్తగా మరో అనుమానం. కంగారుగా పరిసరాలన్నీ గమనించాను. వేరే ఎవరూ ఉన్న సూచనలు కనపడలేదు. అయినా అనుమానం తీరలేదు. అంతలో మళ్లీ వినపడిందతని గొంతు.

‘పలాసకేనా?’, మొరటుగా ఉందా గొంతు. అవునన్నట్లు తలూపాను ఆగకుండా. అతనూ నాతో నడవటం మొదలు పెట్టాడు.

‘ఇంత రాత్రప్పుడు ఒంటరిగా ఎక్కడనుండీ?’ మరో ప్రశ్న. మాట్లాడకుండా నడక వేగం పెంచాను - అతన్నెలాగైనా వదిలించుకునే ఉద్దేశంతో. అతనూ వేగం పెంచాడు.

‘సీరియల్ కిల్లర్ తిరుగుతున్నాడంట. ఒంటరిగా వెళ్లటం మంచిది కాదు. ఇద్దరం కలిసిపోదాం. ఇంతకీ ఎక్కడి నుండొస్తున్నావో చెప్పలేదు?’, ఈ సారి హుకుంలా ధ్వనించిందా ప్రశ్న. చెప్పకపోతే వదిలేలా లేడు.

‘మందుల కోసం వెళ్లొస్తున్నా. దార్లో స్కూటర్ చెడిపోయింది’ అన్నాను ముక్తసరిగా.

‘అర్రె. నా బైక్ కూడా చెడిపోయింది. ఆ చెట్ల చాటున పెట్టొస్తున్నా. రేపొచ్చి తీసుకెళ్లాలి’

*నిజంగానే అతని బైక్ చెడిపోయిందా?* అనుమానంగా అతనివైపు చూశాను. గొంతులో ఉన్న మొరటుదనం అతని ముఖంలో లేదు. *అనవసరంగా అనుమానిస్తున్నా నా?*

నేను చూడగానే ‘మాట్లాడటం తక్కువనుకుంటాను? ఫరవాలేదు. నేను మాట్లాడతాగా’ అంటూ పగలబడి నవ్వాడు. నేనూ నవ్వుదామనుకుని మానుకున్నాను. ఇద్దరం నడక కొనసాగించాం.

అతనేవేవో చెబుతుంటే నేను మౌనంగా వింటూ నడుస్తున్నాను. ఐదు నిమిషాల్లో అనుమానం కొంత తగ్గింది. అయినా నా జాగ్రత్తలో నేనుండటం మంచిదనుకుంటూ అతనికి వీలైనంత ఎడంగా నడవసాగాను – అవసరమైతే పిక్కబలం చూపించటానికి సిద్ధంగా.

వీధి దీపం దాటి చాలా దూరం రావటంతో దాని వెలుగూ కరువైపోయింది. దారంతా గుంతలు. కళ్లు పొడుచుకుని చూస్తూ నడవాల్సొస్తుంది.

ఉన్నట్టుండి ఈదురుగాలులు పెరిగాయి. రోడ్డుపక్కనున్న చెట్లు పడిపోతాయా అన్నట్లుగా ఊగసాగాయి. క్షణాల్లో వర్షం జోరు కూడా పెరిగి కుండపోతగా మారింది. దగ్గర్లోనే చెవులు చిల్లులు పడే శబ్దంతో పిడుగు పడింది. దారంతా నీళ్లు, బురద. అడుగు తీసి అడుగెయ్యటం కష్టమైపోతుంది.

‘ఇంకా ఊరు చాలా దూరముంది. ఇంత వర్షంలో అక్కడిదాకా వెళ్లటం కష్టం. డేంజర్ కూడా. ఇక్కడే ఆగటం మంచిది’, అతను అరుస్తూ చెబుతున్నాడు.

నాకు ఆగే ఉద్దేశం లేదు. అతనికి ఎంత దూరం వీలైతే అంత దూరం వెళ్లాలనుకుంటూ నడవ సాగాను. అంతలో నా భుజమ్మీద పడిందతని చెయ్యి. ఉలిక్కిపడ్డాను.

‘నీకే చెప్పేది. పిడుగులు పడితే ఛస్తావు. అక్కడ ఆగుదాం పద’

అతను చూపించినవైపు చూశాను. రోడ్డుకి సుమారు యాభై మీటర్ల దూరంలో, కుడివైపు, గుబురుగా పెరిగిన చెట్ల వెనకుందది - చిన్న రేకుల షెడ్డులాంటి పాడుపడ్డ ఇల్లు. పరీక్షగా చూస్తే తప్ప కనిపించటం లేదు.

‘తడిస్తే తడిశావు. అందులోకి మాత్రం వెళ్లొద్దు’ అంటూ మొరాయిస్తుంది మనసు. *ముందే వేసుకున్న ప్లాన్ ప్రకారం నన్నక్కడికి తీసుకెళుతున్నాడేమో? మిగతావాళ్లు అక్కడ కాపు కాసి నిరీక్షిస్తుంటే?*

అంతలో నా చెయ్యి పట్టుకుని లాగాడతను. ‘చెవుడు కూడా ఉందా నీకు? లోపలికెళ్దాం రా’ అంటూ. తప్పించుకోటం కుదర్లేదు. దాదాపు నన్ను గుంజుకుంటూ ఇంటి దగ్గరికి తీసుకెళ్లాడు. పగలు చూస్తేనే భయపడేలా పూర్తిగా శిధిలావస్థలో ఉందది. మొండి గోడలు, పైన కూలిపోటానికి సిద్ధంగా ఉన్న రేకుల కప్పు, తలుపు లేని గుమ్మం.

గుమ్మందాకా వెళ్లాక లోపలికి అడుగుపెట్టకుండా బయటే నిలబడిపోయాను. అతను లోపలికెళ్లి రమ్మన్నట్లు నాకేసి చూశాడు. నా చూపులు అతని చేతిలో ఉన్న పౌచ్ మీదకి మళ్లాయి. అప్పుడే మెరిసిన మెరుపుల వెలుగులో నా అనుమానపు చూపులు అతని కంటపడ్డట్లున్నాయి - ఒకసారి పౌచ్‌కేసి చూసుకుని పెద్దగా నవ్వాడు.

‘ఓర్నీ తస్సాదియ్యా. నేనే ఆ హంతకుడ్నని అనుమానమా? ఇందులో కత్తులో తుపాకులో ఉన్నాయని భయమా? అవేం లేవులే. ఇవి నా ఆఫీస్ డాక్యుమెంట్స్. చూస్తావా?’ అంటూ పౌచ్ తెరిచి చూపించాడు. అందులో ఉంది డాక్యుమెంట్లే - తుపాకి కాదు. *హమ్మయ్య*. అనుమానం తీరిపోయింది. ఒక్కుదుటన ధైర్యం వచ్చేసింది. వెంటనే లోపలకడుగుపెట్టాను. అతను పక్కకి తొలగి దారిచ్చాడు.

లోపలంతా చిమ్మచీకటి. చెత్త చెత్తగా ఉన్నట్లుంది. ఏదో వాసన కూడా వస్తుంది. గుమ్మంలోంచి జల్లు లోపలకి కొడుతుంది. దాన్నుండి దూరం జరిగబోతుండగా – వాసన ఎక్కువైన ఫీలింగ్. తాజాగా కాలుస్తున్న చుట్ట కంపు! *అంటే.. అక్కడ మరొక వ్యక్తీ ఉన్నాడా?*

మరుక్షణమే సమాధానం దొరికింది. ఓ మూలగా, నేలకి మూడడుగుల ఎత్తులో వెలుగుతుంది - చుట్ట కాబోలు. అది కాలుస్తున్న వ్యక్తి మాత్రం – చీకట్లో కలిసిపోయి – కనిపించటం లేదు. *ఎవరది?*

నాతో వచ్చినతను – భుజమ్మీద చెయ్యేసి చెవిలో గుసగుసగా చెప్పాడు, ‘అక్కడెవరో ఉన్నారు చూశావా?’

చూశానన్నట్లు తలూపాను.

‘ఎందుకైనా మంచిది. తలుపు దగ్గరే ఉందాం’, భయంగా చెప్పాడతను. నవ్వొచ్చింది. కష్టపడి ఆపుకున్నాను. ఇందాక నన్ను చూసి భయపడ్డట్లు లేడితను. ఇప్పుడు ఇంకెవడ్నో చూసి భయపడుతుంటే నవ్వు రాదా.

గుమ్మం దగ్గరే గోడకానుకుని నిలబడ్డామిద్దరం. బయట వర్షం. లోపల చీకటి. మా మనసుల్లో అలజడి. పావుగంట భారంగా గడిచింది. ముగ్గురి మధ్యా భయంకరమైన నిశ్శబ్దం. *ఎంతసేపిలా?* నాలో అసహనం మొదలయింది. ఆ మూడో వ్యక్తి – అక్కడ మరో ఇద్దరున్నారన్న సంగతే పట్టించుకోకుండా ఆరామంగా చుట్టపీల్చుకుంటున్నాడు. గుప్పు గుప్పున అతనొదుల్తున్న పొగకి నా కడుపులో తిప్పసాగింది.

మరో పావుగంట భారంగా గడిచాక - బయట వర్షం తగ్గుతున్న సూచనలు. పైకప్పు మీద పడుతున్న చినుకుల శబ్దం తగ్గుముఖం పట్టింది. ఉరుములు ఆగిపోయాయి. ఈదురు గాలి కూడా తగ్గిపోయింది.

ఐదు నిమిషాల్లో వర్షం పూర్తిగా తగ్గిపోయింది. మేఘాలు సైతం మాయమైపోయినట్లున్నాయి. పున్నమి రోజులు కావటంతో వెన్నెల కొంత గుమ్మంలోనుండి లోపలికి పడసాగింది. ఆ మసక వెలుగులో మూలగా కూర్చునున్న మూడో వ్యక్తి ఆకారం లీలగా కనిపించింది. ఎవరో బిచ్చగాడులాగున్నాడు. చింపిరి జుత్తు, బవిరి గడ్డం, చిరిగిన దుస్తులు. పక్కనే చిన్న మూట. *అందులో ఏముందో?*

నేనా మూటకేసి రెప్పార్పకుండా చూస్తుండగానే బిచ్చగాడు కదిలాడు. చుట్ట కింద పారేసి ఓ చేత్తో మూటందుకుని, రెండో చేత్తో గోడవారగా పెట్టిన కర్రందుకుని పైకి లేచాడు. నా పక్కనున్నతను అప్రమత్తమవటం తెలుస్తూనే ఉంది.

కర్ర బలంగా నేలకి తాటిస్తూ మమ్మల్ని దాటేసి గుమ్మంగుండా బయటికెళ్లిపోయాడా బిచ్చగాడు – పెద్దగా ఏవో తత్వాలు పాడుకుంటూ.

ఒక్క గెంతులో గుమ్మం దగ్గరికెళ్లాడు నాతో వచ్చినతను. 'అమ్మయ్య, వెళ్లిపోయాడు' అంటూ బిచ్చగాడు వెళ్లినవైపే చూడసాగాడు. అతని గొంతులో రిలీఫ్. నాకూ రిలీఫ్‌గానే ఉంది. అతనటు తిరిగుండగానే ఆలస్యం చెయ్యకుండా ప్యాంటు జేబులోనుండి దాన్ని బయటకి తీసి పరీక్షించాను. పాలిథిన్ కవర్ చుట్టటంతో అంత వర్షంలోనూ భద్రంగానే ఉందది. వణుకుతున్న చేతుల్తో దాన్ని కవర్లోనుండి బయటికి లాగాను.

బిచ్చగాడు చాలాదూరం వెళ్లిపోయినట్లున్నాడు. కర్ర చప్పుడు వినిపించటం లేదు. తత్వాలు మాత్రం గాల్లో లీలగా తేలుతూ వస్తున్నాయి. అతను వెనక్కి తిరిగాడు. 'ముష్టెదవ. తెగ దడిపించా....' అంటూ షాక్ తిన్నట్లు ఆగిపోయాడు.

'ఏంటది? చేతిలో గ..' అతని గొంతులో ఆశ్చర్యం? మాట పూర్తయ్యేలోపే నా చేతిలో పిస్టల్ పేలింది - ఒకటి, రెండు, మూడు, నాలుగు సార్లు. కిక్కురుమనకుండా కూలిపోయాడతను. నేలవాలుతూ నాకేసి చూసిన చివరి చూపులో అతని కళ్లలో కనిపించింది - విభ్రాంతి, దిగ్భ్రాంతి, ఆశ్చర్యం, అపనమ్మకం కలగలిసిన ఆఖరి భావం. ఆ చూపూ, ఆ భావమూ నాక్కొత్త కావు. ఇంతకు ముందు ఐదుసార్లు చూసినవే. ఇంకెన్నోసార్లు చూడబోయేవే. అపరిచితుల ఆఖరి చూపులు ఆస్వాదించటంలో ఉన్న మజా అనుభవిస్తేనే తెలిసేది.

పనయ్యాక చేతి రుమాలు తీసి పిస్టల్ మీద వేలిముద్రల్లేకుండా తుడుస్తూ బయటికొచ్చాను. రోడ్డెక్కగానే పిస్టల్ని దూరంగా తుప్పల్లోకి విసిరేశాను. *ఇక దానితో పనిలేదు. వచ్చేసారికి మరో ఆయుధం వెదుక్కోవాలి.* ప్యాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని తాపీగా నడవసాగాను. ఆర్రోజుల కఠోర ఉపవాసం తర్వాత ఆకలి తీరిన అనుభూతి నాలో. అరగంట కిందటి ఆదుర్దా ఇప్పుడు లేదు. చుట్టూ తుఫాను తరువాతి ప్రశాంతత. పిల్లగాలి ఆహ్లాదకరంగా వీస్తుంది – బిచ్చగాడి తత్వాలని మోసుకొస్తూ – '.. నమ్మకయా మాయదారి లోకుల ..'

నవ్వొచ్చింది. నన్ను చూసి భయపడాల్సింది, *అడుక్కునేవాడిని చూసి భయపడ్డాడు.* పోయేముందు ఏమన్నాడతను – 'పెళ్లిపోయాడు, ముష్టెదవ' అనేనా?

*ఆ ముష్టెదవే తనకి అరగంట ఆయుష్షు ముష్టి పడేశాడని తెలీదతనికి. ముష్టివాడే లేకుంటే ఆ ఇంట్లో అడుగుపెట్టటం ఆలస్యం, అతన్ని లేపేసుండేవాడిని. అసలు – నాకోసం కాపేసిన స్పెషల్ పోలీసాఫీసరేమోనని అనవసరంగా టెన్షన్ పడకపోతే కనపడగానే కాల్చిపారేసేవాడ్ని కానూ? అదేంటో - అందరిని చంపినా ఎప్పటికప్పుడు అదే మొదటి సారన్నంత గాభరా. కుక్కలు అరిచినా నన్ను చూసేనేమోనన్న భయం. ఎప్పటికి అలవాటయ్యేనో!*

(THE END)